


# కాకిగూడు

కథానిక

శింగీతం శ్రీనివాసరావు

కాకి తను గూడుకట్టుకోవడానికి చాలా కష్టపడుతుంది. ఒక్కొక్క పుల్లను వెతికి తెచ్చి, తీరా ఆ కరేపాకుచెట్టు మూడుకొమ్మలమధ్య పెట్టేటప్పటికల్లా పుల్ల జారి కిందపడిపోయేది. మళ్ళీ పైనుంచి కిందికి ఎగిరి, పుల్లనుతీసుకొని వెళ్ళి తన పనిని సాధించేది; జయించేది. ప్రకృతి తనకిచ్చిన పనిని సక్రమంగా చేస్తున్నానని సగర్వంగా కేకవేసేది. ఇలా ఒక్కొక్కసారి కాకి నెమ్మదిగా గూడు కట్టుతూండడం చూస్తుంటె ప్రభుకి బలే సరదాగా ఉండేది. తను పడుకున్న మంచం కిటికీకి దగ్గరగానే వేసారు. అసలు కిటికీపక్కన్నే వెయ్యాలని ప్రభు చాల పట్టు పట్టాడు. కాని చల్లటిగాలివస్తుంది, తగ్గుతున్న జ్వరం మళ్ళీవచ్చిందంటే కష్టమనిచెప్పాడు డాక్టరు. అందుకని కిటికీకి కొద్దిగా దూరంగానే వేశారు మంచం. ఇప్పుడిక జ్వరం భాగా తగ్గిపోయిందిగా! ఇంకా ఎందుకు అమ్మ నాన్నా తనమీద ఇంతకట్టుదిట్టాలు పెడ్తారని అనుకున్నాడు. బయట హాయిగా తిరిగే కాకిని చూచి నప్పుడెల్లా ఆడుకోవాలని ఉబలాటపడే ప్రభుకు అమితంగా ఆవేదన కలిగేది.

అమ్మ మందు తెచ్చిచ్చింది. చేదుమందు!

"ఇంకొక్క పదిహేను నిముషాలుకానీ, ఇప్పుడేగా గంజి తాగా"నన్నాడు ప్రభు ఎలాగో తప్పుకోటానికి.

"ఆఁ! తప్పు నాయనా. మందు తాగకపోతే ఎలా? జ్వరం ఎలా తగ్గుతుంది?"అన్నది అమ్మ. ఏవిధంగా కాదనడం తెలీక చిన్నగా మందుగ్లాసు చేత్తో అందుకున్నాడు. అరవటం, ఏడవడం, కాళ్లు తన్నడం—ఇలాంటి ప్రయత్నాలన్నీ అంతకు ముందు చేసినవే. కాని అవేవీ ఫలించింది కాదు. పైన ప్రతీసారి తను అరచి, ఎగిరి కష్టపడడమేగాని, ఆఖరుకు మందు మాత్రం పుచ్చుకోక తప్పేదికాదు. అందుకని ఇప్పుడు ఒక కొత్తపద్ధతి మొదలెట్టాడు. ప్రతిసారి మందుపుచ్చుకోటానికి అణా అడిగాడు.

"ఓ! నాన్ననడిగి నేనిప్పిస్తానుగా"అన్నది అమ్మ ఆప్యాయంగా. నాన్న ఆఫీసునుంచి వచ్చేవరకు కళ్లుతెరచుకొని కాచుకొని ఉన్నాడు. నాన్న రాగానే అడగటానికి పక్కమీదనుంచి లేవబోయాడు. కాని అమ్మ లేవనిస్తేగా! తనే అడుగుతానని ప్రభును పడుకోపెట్టింది. తనకు కట్టేసినట్లయింది. మొత్తంమీద అమ్మ నాన్నదగ్గరకు వెళ్ళింది.

"ఏమండోయ్, మనం అబ్బాయికి మందు ఇచ్చిందానికి మనకు ఫైన్ ఒక అణా!" అన్నది కాంతం నవ్వుతూ.

రాజారావు చాల సీరియస్‌గా, "అదేమిటి? ఇద్దరికి కలిసి ఒక్క అణా అనుకున్నావేంటి? నీకొక్క అణా, నాకొక్క అణా, ఒక్కొక్కసారి మందు తాగిందానికి బేడ చెల్లించు అబ్బాయిగారికి" అన్నాడు. అప్పట్నుంచి మందు పుచ్చుకున్నప్పుడెల్లా ఒక అణాకుబదులు బేడ వస్తూంది ప్రభుకు. దాన్ని భద్రంగా ఒక హుండీలో వేసి దాచిపెడ్తున్నాడు జ్వరంతగ్గి తర్వాత ఆ డబ్బుతో మోటార్ సైకిల్ కొనవలెననే ఉద్దేశ్యంతో.

ఇక మిగతాసమయాల్లో ఏమీతోచక ఊరికే పడుకోనుండాలి. అలాంటప్పుడు కాకి గూడుకట్టటం చూస్తుంటె భలేగా

ఉండేది. పొద్దున్ననుంచి సాయంత్రందాకా కష్ట పడి, పుల్లలు తెచ్చి గూడు కట్టడం మూడవరోజు సాయంత్రానికి గూడును పూర్తిచేసింది.అది పూర్తి చెయ్యంగానే ప్రభుకు ఎక్కడలేని సంతోషం వచ్చింది.

"అమ్మా, అమ్మా! కాకి గూడును కట్టేసింది. అప్పుడే కట్టేసింది" అన్నాడు ఉత్సాహంతో.

"మరి కాకి గూడుకూడ మన ఇల్లులా సంవత్స రాలు వేసుకుంటే ఏవన్నా ఉందట్రా?" అన్నది అమ్మ దుప్పటి మారుస్తూ.

రెండు రోజులలో జ్వరం పూర్తిగా తగ్గి పోయింది. పత్యం పెట్టవచ్చునన్నాడు డాక్టరు. కాని ఇంకొక పదిరోజులైనా బాగా విశ్రాంతి తీసుకోవాలన్నాడు. ఈ వాక్యం మరీ కష్టంగా తోచింది ప్రభుకు. అంతకు ముందు రోజుల పర్యంతం కాకిగూడ కట్టటం చూస్తుండేవాడు. ఇప్పుడు గూడు పూర్తి అయిందానివల్ల అదికూడ లేదు. ఇక తనకీ ఎలాంటి ఆటలేదు. మాట్లాడ్తే అమ్మవచ్చి ఏదో చెప్పినకథలే చెపుతుంది. నాన్న ఏ పేపర్ చదవడమో, ఏపనిలేని పెద్దవాళ్ళతో మాట్లాడ్డమో చేస్తుంటాడు. ఇక డాక్టరు ఒక్క మంచిముక్క మాట్లాడితే ఒట్టు! పోతే తనతో నేరుగా ఆడుకోకపోయినా, చాలవఱకు తను కాలాన్ని వెలబుచ్చేటట్టు చేసేది ఆకాకి. అందు కని మొదట్నుంచి ఆకాకిమీద అపరిమితమైన అనురాగం కలిగింది ప్రభుకు.

ఆగూడు కట్టుట చూచినపుడెల్లా తను ఒక ప్పుడు ఇటుక రాళ్ళతో చిన్న బొమ్మరిల్లు కట్టటం జ్ఞాపకం వచ్చింది. రెంటినీ పోల్చిచూస్తే కాకి కన్న తనే చాలరెట్లు మేలుగా కట్టినట్టు తెలుసు కున్నాడు. తను ఒక్క ఇటుకరాయికూడ కింద వేయలేదు, పగలగొట్టలేదు.

రాత్రి పడుకొని పొద్దున్న లేవంగానే గూడును చూసేవాడు. ఎందుకో అలా చూస్తుంటే బలే తమాషాగా ఉంది అతనికి. నాన్నతో తనకూ అలాంటి గూడుబొమ్మనొకదాన్ని కొనిమ్మన్నాడు.

"ఇన్ని రకాల వస్తువులుంటే కాకిగూడెం దుకురా?" అన్నాడు నాన్న.

"నాకు కాకిగూడే కావాలి. అన్నాడు ప్రభు కోపంతో.

రెండు రోజులు గడిచింది. గూడు మాత్రం అక్కడనే ఉందిగాని కాకిమాత్రం ఎక్కడా కన బడటంలేదు. ఒకవేళ తను నిద్రపోతున్నప్పుడు వచ్చి వెళ్ళిపోయిందేమోనని అనుకున్నాడు. కాని మరునటిరోజు పొద్దున్న లేవగానే అలా తిరిగి చూచేటప్పటికి తన కళ్ళకు తానే నమ్మలేక పోయాడు. సంతోషంతో గంతులు వేశాడు. మూడు చిన్న కాకిపిల్లలు గూడులోనుంచి తొంగి చూస్తున్నాయి. పెద్దకాకివచ్చి ఏవిటో గింజలు అవీ ఇవీ తెచ్చి పిల్లలనోట్లో పెడ్తూంది. గూడు కట్టటం చూడడంకన్నా కాకి పిల్లలను చూడడం ఎన్నోరెట్లు సరదాగా కనబడింది ప్రభుకు. పొద్దున్న నుంచి సాయంత్రందాకా అలాగే చూస్తుండే వాడు. అనుకోనప్పుడల్లా కాకి పిల్లలు గూడు నుంచి బయటకు వచ్చేవి. అవి నోరు తెరచుకొని అరవలేక అరుస్తూంటే బలే నవ్వువచ్చేది ప్రభుకు. వాటిని రోజంతా పరీక్షగాచూచి, చూచిందంతా సాయంత్రం నాన్నతో చెప్పేవాడు. ఆ కాకి పిల్లలు ఎలాగంతులేసేవి, అవి ఎలా 'అన్నం' తినేవి, వాటి అమ్మ ఎలా వదలేసిపోయి, మళ్ళీ అవి కేక వేసినప్పుడు ఎలా తిరిగివచ్చేది—అంతా పూస గుచ్చినట్టు చెప్పేవాడు. రాజారావు ఇదంతా తప్పనిసరి వినవలసి వచ్చేది. ఒకసారి భార్యనుపిలిచి "ఏమిటే, కాస్త పీడుచెప్పేది ఇలావచ్చి విన కూడదూ!" అనేవాడు తను తప్పుకోటానికి.

"ఆ-మీరంతకన్న ఏంచెయ్యాలి. కొన్నిరోజులు ఆ పేపర్ నిలిపేసి ఈ వార్తలు వినకూడదూ?" అనడిగేది కాంతం. మొత్తంమీద రాజారావుకు అంతకుముందు కాకులసంగతి తెలిసినా, తెలియక పోయినా ఇప్పుడు సమగ్రంగా తెలిసింది. "కాకు లను గురించి నే నిప్పుడొక పుస్తకం వ్రాయొచ్చు" నన్నాడు.

ఆ రోజురాత్రి నిద్రపోయాడు ప్రభు. ఎప్పుడు నిద్రపోయాడో తనకే తెలీదు. కాని ఉదయాన్నే లేచి కాకిగూడు చూడాలని కిటికీవైపు తిరిగే టప్పటికి అక్కడ కిటికీలేదు! తనమంచం కిటికీకి చాలదూరంలో ఉంది. మంచం రాత్రి ఇంత దూరం ఎలావచ్చింది? అమ్మను పిలిచాడు.

"అక్కడున్నమంచం ఇక్కడెందుకు తెచ్చారు?" అన్నాడు కోపంగా.

"ఆ మళ్ళీ అక్కడికే వెళ్లవుగానిలే" అంది అమ్మ.

"నిన్న వర్షంవస్తుంటే నీళ్ళు లోపలికి వస్తూం డింది. మరి చల్లటిగాలి తగిల్తే ఏమన్నా ఉందా?— అందుకని వర్షం నిలిచిపోనీ, మళ్ళీ ఆ మంచం నీ యిష్టప్రకారం అక్కడనే వేసుకుందువుకాని" అన్నది.

ప్రభు దూరంగా ఉన్న కిటికీలోనుంచి చూస్తు న్నాడు. వర్షంచినుకులు చిన్నగా పడ్తూంది ఎంతసేపటికి నిలువలేదు. ఈ వర్షాలు ఎప్పుడూ ఇంతే! అటు ఒక పెద్దవర్షం వచ్చి నిలిచిపోయినా బాగుండును. లేక రాకుండా ఉన్నా సరే. కాని ఈ చిన్న చినుకులు నిలువకుండా అలా కురుస్తూనే ఉంది. "కాలంకాని కాలంలో వస్తుంది ఈవర్షం" అంటూ వర్షాన్ని తిట్టింది అమ్మ. అందు మీదట ప్రభు సంతోషించాడు ఎవరో ఒకరు వర్షాన్ని తిట్టున్నారుకదా అని. రాత్రికి వర్షం పూర్తిగా నిలిచిపోయింది. కిటికీలోనుంచి నక్షత్రాలుకూడా కనబడ్తున్నాయి. ప్రభు అమ్మనడిగాడు "మంచం మార్చవచ్చునా"అని. "రేపు" అన్నది అమ్మ.

కాని ఉన్నట్టుండి మరుసటిరోజు వేకువ జామున పెద్దవర్షం మొదలెట్టింది. ఈ సారి జోరుగా గాలికూడా వీస్తోంది. గాలివేగానికి కిటికీతలుపులు కొట్టుకుంటున్నాయి. బంగాళా ఖాతంలో ఎక్కడో తుఫాను పుట్టిందట. దాని దెబ్బ ఇక్కడికికూడ ఒస్తుందనేవార్త పేపర్లో ఉందని నాన్న చెప్పాడు. నాన్న చెప్పినట్లుగానే మధ్యాహ్నానికి వర్షం పెద్ద గాలివానగా మారింది. అమ్మ త్వరగా వచ్చి తలుపులన్నీ మూయించింది. ప్రభును దుప్పటితో బాగా కప్పింది. తలకు మఫ్లర్ కట్టింది. మూసిన కిటికీ తలుపులు చూస్తున్న ప్రభుకు ఇదంతా చాలా నిరాశ అయి పోయింది పాపం! బయట గాలివానకు కాకిపిల్లలు ఎలా తన్నుకుంటున్నాయో! అసలు గూడు పడ కుండా ఉంటుందా? క్షణక్షణం కాకిపిల్లల సంగతి అతన్నిమరీ ఆందోళన పెట్టింది. ఇంతపెద్ద ఇంట్లోనే తనకు చలిగావుంది. మరి చలిగాలిలో కాకిపిల్లల కెలాఉందో!ఒక్కసారన్నా కాకిగూడుచూపించమని అమ్మనడిగాను. కాని అమ్మ ఒప్పుకోలేదు. ప్రభు ఆసంగతి అడిగినప్పుడెల్లా అమ్మ తనే కిటికిదగ్గరకి వెళ్ళి, కొద్దిగా తలుపుతీసి, గూడు క్షేమంగాఉందని చెప్పి మళ్ళీ కిటికీ మూసేసేది. అమ్మ ఎంత చెప్పినా ఒక్కసారి తను చూడందే తృప్తి ఉండింది కాదు ప్రభుకు ఎలాగైనా సమయంచూచుకొని వెళ్ళి ఒక్కక్షణం చూచి ఒచ్చెయ్యాలనుకున్నాడు. జ్వరం లేనప్పుడు కూడ ఇంత కట్టిదిట్టాలెందుకు! సమయంకోసరం చూస్తున్నాడు.

బాగా చీకటిపడింది. ఇంక కాస్సేపటికి నాన్న భోజనానికి వెళ్తే అమ్మ వడ్డించటానికి వెళ్ళాలి. అప్పుడు మంచి సమయం అనుకున్నాడు. బయట హోరుగా గాలివాన చప్పుడు వినబడ్తూంది. ద్వారం లోనుంచి మధ్యమధ్య మెరపులలో వాననీళ్ళు తళ తళ మెరుస్తున్నాయి. కాచుకొని ఉన్నాడు ప్రభు. ఆఖరుకు చదువుతున్న పుస్తకాన్ని టేబిల్ మీద పెట్టి రాజారావు భోజనానికి బయలుదేరాడు. వెనుకాలనే వడ్డించటానికి వెళ్ళింది కాంతం.

"ఏమండీ-వాడికి పొద్దుపోటానికి ఏదన్నా బొమ్మల పుస్తకాలు తెచ్చి పెట్టకూడదూ?" అన్నది కాంతం వడ్డిస్తూ.

"అనుకున్నా, కాని ఈ వానలో ఎక్కడ? చూద్దాం" అన్నాడు రాజారావు. ఆ తరువాత అలా మౌనంగా భోజనం చేస్తున్నాడు.

ఉన్నట్టుండి హాల్లో పెద్ద చప్పుడు! అర్థంకాక హాల్లోకి పరుగెత్తింది కాంతం. వెనుకాలనే చేతు లను అలాగే కంచంలో కడుక్కొని రాజారావు పరుగెత్తాడు. ఇద్దరు దిగ్భ్రమ చెందారు. కిటికీ తీసుంది. కిటికిలోనుంచి వాన తుంపరలు లోనికి ఎడతెగకుండా కొడ్తూంది. పిల్లవాని దగ్గరకు పరు గెత్తి మెరపులాగా భుజాన ఎత్తుకుంది కాంతం. ఆపలేని అశ్రుధారలు కళ్ళల్లోకి వచ్చాయి. భయంతో ఒళ్ళు కంపించి పోయింది. రాజారావు తటాలున కిటికి తలుపులు మూసేసి మంచదగ్గరకు వచ్చాడు. కాంతం ప్రభును మంచంమీద పడుకో పెట్టింది. త్వరగా దుప్పటికప్పి, తువాలుతో తల మీద పడ్డవాన చినుకులను తుడిచింది. ప్రభు చిన్నగా కళ్లు తెరిచాడు. చలికి వణికిపోతున్నాడు. రాజారావు ప్రభు కడుపుమీద చెయ్యిపెట్టిచూస్తే నిప్పులా మండుతూంది. త్వరితంగావెళ్ళి డాక్టరును

తీసుకొని వస్తానని గొడుగు చేత్తో పట్టుకొని పరుగెత్తాడు. కాంతం భోజనం మానేసి ప్రభు మంచం ప్రక్కన పిల్లవాని తల నిమురుతూ కూర్చుంది ఆవేదనతో.

“అమ్మ-ఆ-గూడు-ఇంకా-ఆ-అక్కణ్ణే-ఉందా?” అన్నాడు ప్రభు చిన్నగా. పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకొని అలాగే ఉందన్నది కాంతం.

“ఏదీ-చూచి-రా-అబద్ధాలు” అన్నాడు ప్రభు. కాంతం కిటికీదగ్గరకు వెళ్ళినట్లుగావెళ్ళి, వెనక్కు తిరిగివచ్చి, “ఓ-ఉంది!” అన్నది. కాస్సేపయింది. మళ్ళ ప్రభుకళ్ళు తెరచి కాకిపిల్లల సంగతి అడిగాడు. కాంతం ఎలాగో ఓలాగు అతన్ని సమాధాన పరచటానికి ప్రయత్నిస్తోంది. కాని ప్రతి అయిదు నిముషాలకు కాకిగూడు, కాకిపిల్లలుతప్ప ప్రభుకు మరేదీ జ్ఞాపకానికి రావటంలేదు.

“పడుకో నాయనా! జ్వరం బాగావచ్చింది. రేపుచూద్దాంగా!” అన్నది కాంతం ఆప్యాయంగా.

“రేపా?” అన్నాడు ప్రభు. “ఇప్పుడు చూపెట్టవూ?” అనడిగాడు మళ్ళీ. కాని కాంతం జవాబు చెప్పేలోగా రాజారావు డాక్టరును పిలుచుకొని వచ్చాడు.

డాక్టరు ప్రభు నాడి పట్టి చూస్తున్నంతకాలం రాజారావు, కాంతం ఇద్దరు మౌనంగా డాక్టరును చూస్తున్నారు. “జ్వరం బాగానే వచ్చింది” అన్నాడు డాక్టరు. కాస్త ఆలోచించి “మరేం పరవాలేదు. ఇప్పుడొక ఇంజక్షను ఇస్తాను రాత్రి బాగా నిద్రపోతే పొద్దున్నకు తగ్గిపోతుంది. బాగా నిద్రపోనివ్వండి” అన్నాడు.

ప్రభు చేతినందుకొని ఇంజక్షన్ ఇచ్చాడు డాక్టరు. ఏమీ తెలియక ప్రభు దూలాలవైపు చూస్తున్నాడు. “బాగా విశ్రాంతి తీసుకోనియ్యం” డని మళ్ళీ చెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు.

కాని ప్రభుమాత్రం నిద్రపోలేదు. కాంతం రాజారావులు ఎంతెంతో చెప్పారు. బొమ్మలు కొనిపెడ్తామన్నారు. ఏమన్నా చేస్తామన్నారు. కాని ప్రభు కళ్ళు మూసుకుని ఒక్కసారి కాకిగూడు చూపెట్టమన్నాడు. “మీరంతా అపద్ధాలు చెప్తారు” అన్నాడు ప్రభు ఏడుస్తూ.

కాంతం కళ్ళనీళ్ళను ఆపుకోలేకపోయింది. కాకిగూడును చూస్తేగాని ప్రభు నిద్రపోడని తెలుసుకున్నాడు రాజారావు. ప్రభుకు నయంకావాలంటే నిద్రపోవాలి. ఎలాగైనా చిన్నగా ఎత్తుకొని కిటికీకి దూరంగా నిలబడి ప్రభుకు కాకిగూడు చూపెట్టాలనుకున్నాడు రాజారావు. కాంతం ముందు వద్దన్నా ప్రభు పట్టుపట్టడం చూస్తుంటే ఒప్పుకోక తప్పిందికాదు. ప్రభుకు బాగా దుప్పటితో కప్పి, మఫ్లరును మళ్ళా తలకుకట్టి ఎత్తుకున్నాడు రాజారావు, కాంతం ముందరగా వెళ్ళి కిటికీని తీసింది. రాజారావు ప్రభును యెత్తుకొని కిటికీకి దూరంగా ఒక్కక్షణం నిలబడ్డాడు. ప్రభు అటుతిరిగి చిన్నగా కళ్ళు తెరిచాడు. బయట అంతా చీకటిగా ఉంది. వర్షం ధారగా కురుస్తూంది. ఉన్నట్టుండి ఒక్క మెరుపు మెరిసింది. ఆ మెరపులో కరేపాకు చెట్టు అటూఇటూ జోరుగా ఊగులాడుతూ ఉండడం కనబడింది. చెట్టులో మూడు కొమ్మలమధ్య కాకిగూడు స్పష్టంగా అగుపడుతూంది. ప్రభుకు పరమానందం అయింది. ఒక్కసారి చిరునవ్వుతో రాజారావు భుజంమీద అలాగే వాలి పడుకున్నాడు. చిన్నగా అతన్ని మంచంమీద పడుకోబెట్టారు. మరుక్షణం ప్రభు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. కాంతం మంచం ప్రక్కనే కూర్చుంది చాలాసేపటివరకు. కానీ ఎప్పుడు నిద్రపోయిందో తెలీదు. పొద్దున్న లేచి చూచేటప్పటికి మంచంప్రక్కనే పడుకొని వుంది.

ప్రక్కకు తిరిగిచూచింది. ప్రభు ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. చిన్నగా అతని కడుపుమీద చెయ్యిపెట్టి చూచింది. జ్వరం చాలామట్టుకు తగ్గింది. దానితో తన కలవరం కూడా తగ్గింది.

లేచి పెరట్లోకి వెళ్ళేటప్పటికి వర్షం నిలిచిపోయింది. అవ్యక్తమైన మనోభావాలు మనస్సులో అలలలా కొట్టుకుంటూంటే అలా ప్రక్కకు తిరిగి చూచింది. ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది! రాత్రి గాలివానకు ఊగులాడుతున్న చెట్టు క్రిందపడిపోయి ఉంది. చెట్టుకింద కాకిగూడు. అందులోని కాకిపిల్లల కళేబరాలు నీళ్ళల్లో కొట్టుకుంటున్నాయి. అది చూచిన కాంతం హృదయం తరుక్కుపోయింది. మళ్ళీ హాల్లోకివచ్చి చూచింది. ప్రభు మంచంమీద ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. కళ్ళనీళ్ళమధ్య చిరునవ్వు—

★